# సమష్టి కృషితో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన

- 15వ తేదీ వరకు పారిశ్రామిక, పని ప్రదేశాల్లో స్పెషల్ డ్రైవ్
- కలెక్టర్ ప్రావీణ్య


కలెక్టరేట్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, జూన్ 9 : ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమష్టి కృషితో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంపై సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో జిల్లా సంక్షేమాధికారి జయంతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్పెషల్ డ్రైవ్ టీం జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాలు, షాపులు, ప్రమాదకర ప్రాంతాల్లో కార్మిక శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, కార్మిక శాఖ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీస్ యూనిట్, చైల్డ్ హెల్ప్ లైన్, షేర్, ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పేర్కొన్నారు. 14సంవత్సరాల్లోపు బాలబాలికలు పని చేస్తున్నట్లు గుర్తిస్తే బాల కార్మిక నిర్మూలన చట్టం ప్రకారం సంబంధిత యజమానులపై కేసు నమోదు చేయాలని,18 సంవత్సరాల్లోపు బాల బాలికలు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే బాలల న్యాయ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. జయంతి మాట్లాడుతూ.. రోజువారీగా కార్మిక శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారి ఆధ్వర్యంలో వివరాలు సేకరించి నివేదికలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో లేబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ ఏఎస్ వినీత, ఎన్సీఎల్పీ డైరెక్టర్ బుర్ర అశోక్ కుమార్, బాలల సంక్షేమ సమితి సభ్యులు కజాంపురం దామోదర్, సందసాని రాజేంద్రప్రసాద్, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జి అధికారి ప్రవీణ్ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ భాస్కర్, ఏహెచ్‌టీయూ ఎస్‌ఐ ఫిలిప్‌రాజ్, పీసీ రాము, ఎఫ్‌ఎంఎంఎస్‌ఎస్ఎస్ సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, ప్రోగ్రాం మేనేజర్ బత్తుల కరుణ, సోషల్ వర్కర్స్ శ్రీనివాసులు, సునీత, ఓఆర్ డబ్ల్యూ విజయ్ కుమార్, షేర్ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ శిరీష, ప్రతినిధులు జమున, జ్ఞానేశ్వరి, చామంతి పాల్గొన్నారు.

**వీసీలో పాల్గొన్న కలెక్టర్..**

రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్ నుంచి మంత్రి, సీఎస్ రామకృష్ణారావుతో కలిసి బడిబాట, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీలో కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఆర్డీవో పాల్గొన్నారు.

**గ్రీవెన్స్ అర్జీలు సత్వరమే పరిష్కరించాలి..**

గ్రీవెన్స్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బాధితుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 137 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో వివిధ తహసీల్దార్ కార్యాలయాలకు సంబంధించినవి 46, జీడబ్ల్యూఎంసీ 16, పీడీ హౌసింగ్ 12, హనుమకొండ ఆర్డీవో 11, ఎంపీడీవో ఆఫీసు 8, పరకాల ఆర్డీవో 7, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్లకు సంబంధించి 6, ఎన్పీడీసీఎల్‌కు సంబంధించి 4 ఉన్నాయి. అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, ఆర్డీవోలు రాథోడ్ రమేశ్, నారాయణ పాల్గొన్నారు.

**లోపాలు ఎత్తి చూపినందుకు కులం నుంచి బహిష్కరించారు..**

**- తాళ్లపల్లి రామకృష్ణ, జయగిరి, హసన్‌పర్తి**



పెద్ద మనుషుల లోపాలను ఎత్తి చూపినందుకు నన్ను కుల బహిష్కరణ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నేను గౌడ కులస్తుడిని. గౌడ వృత్తితో జీవనోపాధి పొందుతున్నాను. పెద్దల తప్పులను లేవనెత్తినందుకు నన్ను తాళ్లు ఎక్కకుండా కుల బహిష్కరణ చేసి నా పరువు తీస్తూ ఐదు నెలల నుంచి జీవనోపాధి లేకుండా చేశారు. ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

**ఆరుగురు బిడ్డలుండీ అనాథనయ్యాను..**

**- చింతకుంట్ల కమలమ్మ, కౌకొండ ధర్మారం**



ఆరుగురు బిడ్డలున్నా అనాథనయ్యానని కౌకొండ ధర్మారం గ్రామానికి చెందిన చింతకుంట్ల కమలమ్మ (70) కన్నీటి పర్యంతమైంది. నా భర్త చింతకుంట్ల వెంకట్ రెడ్డి 14ఏళ్ల క్రితమే చనిపోయాడు. అప్పటి నుంచి అందరి పిల్లలను సాకుతూ పెండ్లిళ్లు చేశాను. నన్ను సాదుతారనే ఆలోచనతో నాకు ఉన్న భూమి అంతా అందరికీ సమానంగా పంచి ఇచ్చాను. నాకు పింఛన్ వస్తుంది. ఆ పింఛన్‌తోనే నాకు అవసరమయ్యే మందులు ఇతర ఖర్చులు వెళ్లదీసుకుంటున్నాను. నా కుమార్తెలు నన్ను పట్టించుకోవడం లేదు. నా ఆరోగ్యం సరిగా ఉండడం లేదు. నాకు మీరే న్యాయం చేయాలి.

**పంచిన భూమిని మా పేరుపై చేయండి..**

**- ఉడుత కొమురమ్మ - సమ్మయ్య దంపతులు, సీతారంపురం, పరకాల**



కొడుకుల పేరుపై పట్టా చేసిన భూమిని మా పేరుపై చేయాలి. మాకు ఇద్దరు కుమారులు, కుమార్తె. అందరి పెండ్లిండ్లు అయ్యాయి. నేను గొర్లు కాసేవాడిని. కాయకష్టం చేసి మూడెకరాల భూమి సంపాదించాను. మా బాగోగులు చూసుకుంటామని నమ్మించి ఇద్దరు కొడుకులు ఎకరంన్నర చొప్పున భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అప్పటి నుంచి మా బాగోగులు చూసుకోవడం లేదు. నా భార్య కొమురమ్మ రెండు కాళ్లు విరిగిపోయి ఇబ్బందులు పడుతున్నది. అలాగే నా ఆరోగ్యం బాగా లేకపోవడంతో లక్షలు ఖర్చు చేసి మేమే బాగు చేయించుకున్నాం. మా కుమారులు మా ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదు. కనీసం తిండి పెట్టడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. కుమారుల పేరుపై ఉన్న భూమిని నా భార్య పేరుపై చేసి మాకు న్యాయం చేయాలి.

## రాజీవ్ యువ వికాసం పేరుతో కాంగ్రెస్ మోసం

భీమదేవరపల్లి, జూన్ 9 : రాజీవ్ యువ వికాసం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తున్నదని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కండె సుధాకర్ ఒక ప్రకటనలో విమర్శించారు. రాజీవ్ యువ వికాసం పథకం వల్ల నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుంటే ఇప్పటి వరకు సదరు పథకంపై ప్రస్తావనే లేదని ఆరోపించారు. రూ.50వేల నుంచి 4 లక్షల వరకు ఇస్తామని చెప్పడంతో నిరుద్యోగులు ఇబ్బడి ముబ్బడిగా దరఖాస్తులు చేసుకున్నారని గుర్తు చేశారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం వెంటనే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

## ఇంటికి అడ్డంగా ప్రహరీ నిర్మించారని బాధితుల ఆవేదన

వేలేరు, జూన్ 9 : తమ ఇంటికి వెళ్లే ప్రధాన రహదారిలో ఇంటి మార్గానికి అడ్డుగా ప్రహరీ నిర్మించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలేరుకు చెందిన కాళేశ్వరం మహేశ్, అతడి కుటుంబ సభ్యులు వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఉంటారు. కాగా, వేలేరులో ఉన్న వారి ఇంటికి అడ్డుగా వారి ఇంటి పక్కనే ఉన్న కాళేశ్వరం భిక్షపతి, రాంచందర్ గోడ నిర్మించి ఇంట్లోకి వెళ్లకుండా చేశారని తెలిపారు. ఇంటి దారిలో ప్రహరీ ఎందుకు నిర్మించారని ప్రశ్నిస్తే బెదిరిస్తూ దాడికి ప్రయత్నిస్తున్నారని బాధితులు తెలిపారు. దీంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తే ఎస్సై అందుబాటులో లేరని, సివిల్ వివాదాలను బయటే పరిష్కరించుకోవాలని పోలీసులు చెప్పారన్నారు. తాతలు, తండ్రుల కాలం నుంచి ఇక్కడే ఉంటున్నామని, జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్నట్లు బాధితులు తెలిపారు. దారిలో అక్రమంగా గోడ నిర్మించిన వారిపై చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

## పెంచికల్‌పేట ఎల్లమ్మ గుడిలో చోరీ

**పుస్తె, మట్టెలు, వెండి అపహరణ**

ఎల్కతుర్తి, జూన్ 9 : పెంచికల్‌పేటలోని ఎల్లమ్మ గుడిలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. కొన్నేళ్లుగా భక్తులు అమ్మవారికి బంగారం, వెండి రూపంలో కానుకలు సమర్పించారు. వీటిని ఆలయంలోనే ఉంచుతున్నారు. మంగళవారం ఎల్లమ్మతల్లి జాతర ఉండగా, నిర్వాహకులు ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆలయ తలుపులు తెరిచేందుకు చూడగా, అప్పటికే తాళాలు పగులగొట్టి కనిపించాయి. దీంతో నిర్వాహకులు ఆలయంలోకి వెళ్లి చూడగా, అమ్మవారి పుస్తె మట్టెలు, వెండి, చెవి, ముక్కు కమ్మలు కనిపించలేదు. దాదాపు 35 నుంచి 40తులాల వెండి, తులం బంగారం చోరీకి గురైనట్లు చెబుతున్నారు.

## పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి : డీఈవో

హనుమకొండ చౌరస్తా, జూన్ 9 : పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని డీఈవో వాసంతి అన్నారు. హనుమకొండ లష్కర్‌బజార్ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు శిక్షణ ఇచ్చేందుకు రిసోర్స్‌పర్సన్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల పరిసరాలు, టాయిలెట్లు శుభ్రం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ మహేశ్, హెచ్‌ఎం ధర్మయ్య, రిసోర్స్‌పర్సన్ నరేష్, పారిశుధ్యకార్మికులు లావణ్య, ప్రమీల పాల్గొన్నారు.

## సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు లెటర్ ఆఫ్ ఆర్డర్ జారీ

హనుమకొండ, జూన్ 9 : ఎన్పీడీసీఎల్ పరిధిలో తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (రెడ్కో) రైతులు, రైతు సంఘాలు కుసుమ్– ఏ పథకం కింద సోలార్ ప్లాంట్ పెట్టుకొనేందుకు లెటర్ ఆఫ్ అవార్డు జారీ చేసినట్లు సీఈ వెంకటరమణ తెలిపారు. 461 మంది రైతులు, రైతు సంఘాలకు లెటర్ ఆఫ్ అవార్డు ఇచ్చినట్లు చెప్పారు. సోమవారం నక్కలగుట్టంలోని ఎన్పీడీసీఎల్ విద్యుత్ భవన్‌లో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లు కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం మంగళ వారం కొనసాగుతుందని, రెడ్కో అందించిన సమాచారం ప్రకారం అందరూ పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్ కుమార్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, జీఎం మల్లికార్జున్, డీఈ అమర్‌నాథ్, రెడ్కో మేనేజర్లు గంధం రాజేందర్, గంగుల మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, జూన్ 9 : దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా జిల్లాలోని దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్నామని, మహిళా శిశు సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల జిల్లా శాఖ దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సంక్షేమాధికారి జయంతి తెలిపారు. రెట్రోఫిటెడ్ మోటరైజ్డ్ వాహనాలు, బ్యాటరీ వీల్ చైర్లు, మొబైలు బిజినెస్ బ్యాటరీ సైకిళ్లు, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికల్స్, హైబ్రిడ్ వీల్ చైర్, అటాచ్‌మెంట్ వీల్ చైర్, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్స్, 49 ఫోన్లు, ట్రై సైకిళ్లు, కాలిపర్స్, ఆర్టిఫిషియల్ లిమ్స్, క్రచెస్, వాకింగ్ స్టిక్స్, స్మార్ట్ కేన్స్, బ్రెయిలీ బుక్స్, కిట్స్, టీచింగ్ లర్నింగ్ మెటీరియల్, ఎంసీఆర్ చప్పల్స్ ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన దివ్యాంగులు http://obmms.cgg.Gov.in// వెబ్‌సైట్‌లో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జత చేసి ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## పల్లె ప్రకృతి వనంలో జీపీ భవనం వద్దు

శాయంపేట, జూన్ 9 : మండలంలోని గంగిరేణిగూడెం పల్లె ప్రకృతి వనంలో అనుమతులు లేకుండా చెట్లను నరికిన నాయకులపై చర్య తీసుకోవాలని, అక్కడ జీపీ భవనం నిర్మించొద్దని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మాజీ ఎంపీటీసీ లతాలక్ష్మీరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు ఎండీ ముగ్దుంపాషా తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో పంచాయతీ భవనం నిర్మించేందుకు ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు నాయకులు 10 చెట్లను నరికివేశారని తెలిపారు. పల్లె ప్రకృతి వనం పక్కనే ఆరు గుంటల ప్రభుత్వ స్థలం ఉన్నదని, అందులో భవనం నిర్మించాలని కలెక్టర్‌ను కోరారు. నాయకుడు అశోక్ ఉన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలి

శాయంపేట, జూన్ 9 : ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలని నేరేడుపల్లి ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ అల్లం మాధవి అన్నారు. సోమవారం బడిబాట నిర్వహించారు. పలువురు తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. నేరేడుపల్లి పాఠశాల పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించిందని చెప్పారు. రమేశ్, మొత్కూరి భాస్కర్ పాల్గొన్నారు.

## కిట్స్‌లో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం

హసన్‌పర్తి, జూన్ 9 : జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ (డబ్ల్యూడీబీఏ) ఆధ్వర్యంలో ఎర్రగట్టు సమీపంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. పోటీలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు వైస్ ప్రెసిడెంట్ బ్యాట్, డబ్ల్యూడీబీఏ జనరల్ సెక్రటరీ రమేశ్‌రెడ్డి తెలిపారు. అండర్–11, 13,15, 17 విభాగంలో బాలబాలికలు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 170 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో డబ్ల్యూడీబీఏ కోశాధికారి నాగకిషన్, వైస్ ప్రెసిడెంట్ మోహన్‌రావు పాల్గొన్నారు.

## పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ

**పోస్టర్లు ఆవిష్కరించిన ఆర్‌ఎం విజయభాను**

హనుమకొండ చౌరస్తా, జూన్ 9 : ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని 9 డిపోల నుంచి వివిధ పర్యాటక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక టూర్ ప్యాకేజీలతో బస్సులు నడపనున్నట్లు ఆర్‌ఎం విజయభాను తెలిపారు. సోమవారం ఆర్‌ఎం కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. హనుమకొండ నుంచి పంచారామాలు, అరుణాచలం, భద్రాచలం, వేములవాడ, నాగార్జునసాగర్, బొగత, రామప్ప, లక్నవరం, మల్లూరు ఇంకా ఇతర పర్యాటక ప్రదేశాలకు బస్సులు నడపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఓ) భానుకిరణ్, ఏవో రవీందర్, పీవో సైదులు, వరంగల్–1 వన్ డీఎం అర్పిత, వరంగల్–2 డీఎం జ్యోత్స్న, హనుమకొండ డీఎం ధరమ్‌సింగ్ పాల్గొన్నారు. ప్రత్యేక టూర్ ప్యాకేజీల వివరాల కోసం ఆయా డిపో మేనేజర్లను (వరంగల్–1 9959226047, వరంగల్–2 9959226048, హనుమకొండ 8977781103, పరకాల 9959226051, నర్సంపేట 9959226052, భూపాలపల్లి 9959226707, తొర్రూరు 9959226053, మహబూబాబాద్ 9959226054, జనగామ 9959226050) సంప్రదించాలని కోరారు.

**ప్యాకేజీలను సద్వినియోగం చేసుకోవాలి..**

పరకాల : పుణ్యక్షేత్రాలు, విహార యాత్రలకు వెళ్లేందుకు పరకాల డిపో ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ప్రత్యేక టూర్ ప్యాకేజీలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ రవిచందర్ పేర్కొన్నారు. ప్రత్యేక టూర్ ప్యాకేజీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మరిన్ని వివరాలకు 9705479088, 9666919190 నంబర్లలో సంప్రదించొచ్చని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ కృష్ణకుమారి, ఏఈ రాజశ్రీ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ఆత్మకూరు, జూన్ 9 : మండల కేంద్రంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, మాజీ ఎంపీటీసీ పరికిరాల వాసు పాల్గొన్నారు.

**ఇంటి నిర్మాణంలో నాణ్యత పాటించాలి..**

దామెర : మండలంలోని పులుకుర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను గ్రామ ప్రత్యేక అధికారి వెంకటేశ్ పరిశీలించారు. గ్రామంలో 39 ఇళ్ల నిర్మాణ పనులకు హౌసింగ్ ఏఈ ఆకాంక్షతో కలిసి భూమి పూజ చేశారు. ఇంటి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని సూచించారు. కార్యదర్శి అర్షం శ్రీను, వెంకటేశ్వర్లు, సారంగపాణి, కిరణ్‌కుమార్, సునీత, మమత, రాజు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## గట్టు మల్లన్న హుండీ ఆదాయం రూ.4.49 లక్షలు

వేలేరు, జూన్ 9 : మండలంలోని మల్లికుదుర్ల గట్టు మల్లికార్జున స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని ఆలయ సిబ్బంది, అధికారులు సోమవారం లెక్కించారు. ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వరరావు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ వరంగల్ పరిశీలకుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కించగా రూ.1,19,083 సమకూరినట్లు చెప్పారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా కలిపి మొత్తం రూ.4,49,687 సమకూరినట్లు ఆలయ ఈవో తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు రాజుశర్మ, మహేశ్‌శర్మ, సిబ్బంది సాంబరాజు పాల్గొన్నారు.

## దూర విద్యా కేంద్రం సైన్స్ విభాగాల అసిస్టెంట్ డైరెక్టర్‌గా శ్రీనివాస్


శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, జూన్ 9 : కాకతీయ విశ్వవిద్యాలయ మైక్రో బయాలజీ విభాగ సహాయ ఆచార్యులు ముంజం శ్రీనివాస్‌కు విశ్వవిద్యాలయ దూరవిద్యా కేంద్రం సైన్స్ విభాగాల అసిస్టెంట్ డైరెక్టర్‌గా వైస్ చాన్సలర్ ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ రామచంద్రం ఒక సంవత్సర కాలానికి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ గతంలో మైక్రో బయాలజీ విభాగాధిపతిగా, మైక్రో బయాలజీ విభాగ పాఠ్యప్రణాళికా అధ్యక్షుడిగా, యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ న్యాక్ కో ఆర్డినేటర్‌గా పని చేశారు. ప్రస్తుత అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట గోపీనాథ్ పదవీకాలం పూర్తికావడంతో ఈ ఖాళీ ఏర్పడింది.

## గ్రీవెన్స్ వినతులపై నిర్లక్ష్యం

- టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు
- బాధితుల ఆగ్రహం


బల్దియా గ్రీవెన్స్‌లో నగరవాసుల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

వరంగల్, జూన్ 9 : గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన వినతులను పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. కార్పొరేషన్ స్థలం కబ్జా అవుతుందని పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కార్పొరేషన్‌లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు గ్రీవెన్స్ నిర్వహించారు. 30వ డివిజన్ పరిధిలోని ఏషియన్ మాల్ వెనుక భాగంలోని 1081 సర్వే నంబర్‌లో సుమారు 570గజాల మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసి ఏకంగా భవనం నిర్మిస్తున్నారని కార్పొరేటర్ రావుల కోమల–కిషన్ ఫిర్యాదు చేశారు. గతంలో సర్వే చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రభుత్వ స్థలంగా తేల్చారని విన్నవించారు. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని పలుమార్లు గ్రీవెన్స్‌లో విన్నవించినా పట్టించుకోకుండా భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం ఏంటని కార్పొరేటర్ టౌన్‌ప్లానింగ్ అధికారులను నిలదీశారు. వెంటనే అనుమతులు రద్దు చేసి ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షం పడితే బురదమయంగా మారుతున్నదని, మున్సిపల్ ఆధ్వర్యంలో మొరం పోయించాలని ప్రధానోపాధ్యాయుడు వినతిపత్రం అందజేశారు. లక్ష్మీ మెగా టౌన్‌షిప్‌లో విరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని టౌన్‌షిప్ నివాసులు వినతిపత్రం ఇచ్చారు. 35వ డివిజన్ పుప్పాలగుట్ట గణపతి నగర్ రోడ్ నంబర్–8లో మట్టి రోడ్డు ఉందని, దాని స్థానంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని కాలనీవాసులు విన్నవించారు. పలు డివిజన్లలో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని బీజేపీ నాయకుడు బాకం హరిశంకర్ ఫిర్యాదు చేశారు. ఈ గ్రీవెన్స్‌లో 76 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 39, ఇంజినీరింగ్ విభాగం 17, ప్రజారోగ్య విభాగం 6, పన్నుల విభాగం 10, తాగునీటి సరఫరా 4 వినతులు వచ్చాయి. అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, ఇన్‌చార్జి ఎస్‌ఈ శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి రమేశ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలి

హసన్‌పర్తి, జూన్ 9 : రోడ్లు ప్రమాదాలు జరుగకుండా నియంత్రించాలని ఆర్ అండ్ బీ ఈఈ సురేశ్‌బాబు అన్నారు. నిత్యం ప్రమాదాలు జరిగే ఉనికిచర్ల రోడ్డు నుంచి నిరూప్ నగర్ తండా, సుబ్బయ్యపల్లి గ్రామాలకు వెళ్లే రహదారులను డీఈఈ రాజుతో కలిసి ఈఈ సోమవారం పరిశీలించారు. ఆయన వెంట హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు అన్నారు.

## పాలకుర్తి ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి బదిలీ

సుబేదారి, జూన్ 9 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని పాలకుర్తి ఇన్‌స్పెక్టర్ మహేందర్ బదిలీ అయ్యారు. మల్టీ జోన్–1లో ఎనిమిది మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సోమవారం ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. మహేందర్‌రెడ్డిని మహబూబాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

## హనుమకొండ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రంజిత్

హనుమకొండ, జూన్ 9 : హనుమకొండ తహసీల్దార్‌గా అక్కడే డీటీగా విధులు నిర్వర్తిస్తున్న రంజిత్‌కు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ప్రావీణ్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న కర్ర శ్రీపాల్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. అయితే ప్రస్తుత రెవెన్యూ సదస్సులు, రేషన్ కార్డుల ప్రక్రియతో పాటు ఇతరత్రా పనుల నేపథ్యంలో డీటీ రంజిత్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

## కార్మికులకు అవగాహన కార్యక్రమం


అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్

మడికొండ, జూన్ 9 : మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 300 మంది కార్మికులకు పోలీసులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ మాట్లాడుతూ.. నేరాలను అదుపు చేసేందుకు కార్మికుల వివరాలు తీసుకున్నామన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అలవాటు ఉన్నవారు వెంటనే మానుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి పని చేస్తున్న కార్మికులు తమ రాష్ట్రంలో ఏదైనా కేసులు ఉంటే ఆ వివరాలను పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలన్నారు. ఎస్సై రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

ఆత్మకూరు, జూన్ 9 : ఆన్‌లైన్ లావాదేవీలు జరిపే సమయంలో ఫోన్‌కు వచ్చే ఓటీపీలను ఇతరులకు చెప్పొద్దని సీఐ సంతోశ్ తెలిపారు. సోమవారం పోలీసులు ప్రజలకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

మడికొండ, జూన్ 9 : రాంపూర్‌లో ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి చెందాడు. ధర్మసాగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కైలాస్ రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం రాంపూర్‌లో రోడ్డు దాటుతుండగా కాజీపేటకు వెళ్తున్న కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కైలాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదంపై ఆరా తీశారు. కైలాస్ భార్య శ్యాంబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎంజీఎం దవాఖానకు తరలించారు.

**ఎక్సెల్‌కు కారు ఢీకొని మరొకరికి తీవ్ర గాయాలు..**

ఆత్మకూరు : దుర్గంపేట శివారులో ఎక్సెల్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. దుర్గంపేట గ్రామానికి చెందిన గడ్డం ప్రభాకర్ ఈ నెల 6న ఎక్సెల్‌పై గూడెప్పాడ్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో గాయాలయ్యాయి. ప్రభాకర్‌ను ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతున్నాడన్నారు. ప్రభాకర్ కుమారుడు రాకేశ్‌కుమార్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కారు యజమాని అశోక్ చౌదరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.


## ఆవు దూడను తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

మడికొండ, జూన్ 9 : ఆవు దూడను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను మడికొండ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కథనం ప్రకారం.. భట్టుపల్లిలో ఎస్సై రాజ్‌కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు రామనాథం, అంపయ్య, కానిస్టేబుల్ గోవర్ధన్ వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఆటోను ఆపకుండా పారిపోయాడు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని ఆటోను చెక్ చేసి ఆవు దూడ ఉన్నట్లు గుర్తించారు. నిందితుల్లో కడిపికొండకు చెందిన బస్కె నవీన్, కాజీపేట దర్గాకు చెందిన ఎండీ యూసుఫ్, ఎండీ అబీద్ హుస్సేన్(ఆటో డ్రైవర్) ఉన్నట్లు చెప్పారు. ఆటో, ఆవు దూడను స్వాధీనం చేసుకున్నారు.

# కోర్టు కేసులో రాజీ పడలేదని వివాహిత హత్య

- నిందితుడు గూళ్ల రాజు అరెస్టు
- కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి వెల్లడి

భీమదేవరపల్లి, జూన్ 9 : కోర్టు కేసులో రాజీపడడం లేదని కోల సుమలత(36)ను అతి దారుణంగా హత్య చేసిన గూళ్ల రాజును అరెస్టు చేసినట్లు కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం ముల్కనూరు పోలీస్‌స్టేషన్‌లో నిందితుడి అరెస్టు చూపి వివరాలు వెల్లడించారు. మండలంలోని గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన సుమలత ఇంటి పక్కనే రాజు ఇల్లు ఉంది. మూడేళ్ల క్రితం నిందితుడు రాజు లేగ దూడ చనిపోయిన విషయంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో సుమలత బావ సంపత్‌ను రాజు కొట్టగా అతడిపై కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడు రెండు రోజులు జైల్లో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షిగా సుమలత ఉండడంతో రాజీ పడాలని పలుమార్లు అడిగినా ఆమె వినలేదు. దీంతో గతేడాది ఆమెను చంపుతానని సుమలత ఇంటికి వెళ్లి గొడ్డలితో దాడి చేయబోయాడు. ఆమె కొడుకు వెంకటేశ్ అడ్డు రాగా, అతడి తలకు తీవ్ర గాయమైంది. దీనిపై ముల్కనూరు ఠాణాలో బాధితురాలు ఫిర్యాదు చేయగా పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. దీంతో రెండు నెలలు జైల్లో ఉండి నిందితుడు బయటకు వచ్చాడు. ఈ క్రమంలో మొదటి కేసు కోర్టులో ట్రయల్‌కు రావడంతో సుమలత సాక్ష్యం చెబితే తనకు శిక్ష పడుతుందని భావించాడు. కొన్ని రోజులుగా సుమలతను కేసులో రాజీపడాలని పలుమార్లు ఫోనులో బెదిరించినా ఆమె భయపడలేదు. దీంతో ఈ నెల 5న సుమలత ఇంటి వద్ద ఒంటరిగా ఉండడాన్ని గమనించాడు. ఆమెను హతమార్చితే తాను రెండు కేసుల నుంచి తప్పించుకోవచ్చని భావించాడు. దీంతో గొడ్డలితో ఆమె ఇంట్లోకి వెళ్లి సుమలత తలపై మోదడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. అనంతరం మృతురాలి ఫోన్, వెంట తెచ్చుకున్న గొడ్డలితో రాజు పరారయ్యాడు. ఈ ఘటనపై సెంట్రల్‌జోన్ డీసీపీ సలీమా ఆదేశాల మేరకు తన ఆధ్వర్యంలో పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సోమవారం ముల్కనూరు సమ్మక్క–సారలమ్మ కమాన్ సమీపంలో నిందితుడిని పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడిని విచారించగా హత్య సమయంలో తాను ధరించిన బట్టలను కాల్చాడని, దాచిన మృతురాలి సెల్‌ఫోన్, గొడ్డలి, నిందితుడి బండిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాజును పట్టుకొన్న ఎల్కతుర్తి సీఐ పులి రమేశ్, ముల్కనూరు, ఎల్కతుర్తి, వంగర ఎస్సైలు నంద్రు సాయిబాబు, ప్రవీణ్‌కుమార్, దివ్య, సిబ్బందిని అభినందించారు.


నిందితుడి అరెస్టు చూపుతున్న కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**జ్యోతిష్యం చెప్పబడును**

★ శ్రీమేడారం ఓంశక్తి జ్యోతిషాలయం. విద్య, ఉద్యోగం, విదేశీప్రయాణం, వ్యాపారం, నాగదోషము, నరఘోశ ప్రేమించుకున్న వారు దూరం అవటం, ఎన్ని సంబంధాలు వచ్చినా పెళ్లి కుదరకపోవడం, సంతానం లేకపోవడం, భార్య, భర్తల మధ్య కలహాలు రావటం మరియు ఎటువంటి సమస్యలకైన శాశ్వత పరిష్కారం 3 రోజులలో 100% చేయబడును. అన్ని మతాల వారికి జ్యోతిష్యం చెప్పబడును. గురూజీ కోయరాజు : రాజు గారు. సంప్ర: సెల్: 9912280354.
NTW-337017

**CHANGE OF NAME**

I, THURPATI RAJU S/o SAMMAIAH, R/o H. No. 1-9/2, Tekumatla Village & Mandal, Jayashankar Bhupalpally district. I have changed my daughter name from THURPATI AMMULU to THURPATI SATHWIKA for all Purposes.

**WANTED**

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

**WANTED**

jobs Apply Now!

★హనుమకొండలో గల ప్రముఖ కార్ డెకార్స్ నందు పనిచేయుటకు కార్ ఎలక్ట్రీషన్స్, సూపర్‌వైజర్స్ (Female) మరియు కార్ వాషింగ్ చేయుటకు Male/Female వర్కర్స్ కావలెను. సెల్: 7995621165, 6303776310.
NTW-307

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565